సాక్షి పల్నాడు

మంగళవారం । 28 । మార్చి । 2023



నృసింహుని హుండీ లెక్కింపు

మంగళగిరి: స్థానిక శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయ హుండీ కానుకలు సోమవారం లెక్కించారు. దిగువ సన్నిధిలోని ముఖ మండపంలో లెక్కించగా ఆదాయం రూ.41,48,381 సమకూరింది.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6,200, గరిష్ట ధర రూ.8,000, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.



జాతీయ పోటీలకు లిఫ్టర్ల ఎంపిక

మంగళగిరి: జాతీయ పోటీలకు ఇద్దరు లిఫ్టర్లు ఎంపికైనట్లు పవర్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు సోమవారం తెలిపారు. వీరిలో వి.రేవతి, జి.చంద్రిక ఉన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
నరసరావుపేట	6:27	4:46
గుంటూరు	6:25	4:49
బాపట్ల	6:25	4:49

న్యూస్‌రీల్

సబ్ జైలు తనిఖీ



గురజాల: స్థానిక సబ్‌జైలును జూనియర్ సివిల్ జడ్జి కె.మంజులత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలు తాగునీటి వసతి సరిగ్గా లేదని జడ్జి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన జడ్జి నీటి శుద్ధి యంత్రానికి మరమ్మతులు నిర్వహించి ఖైదీలకు తాగునీటిని అందించాలని ఆదేశించారు. అదే విధంగా ఖైదీలకు వైద్య సేవలు సరిగ్గా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదుల బాక్స్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆమె వెంట న్యాయవాది కలివెల ప్రభుదాసు ఉన్నారు.

మిర్చి యార్డుకు 92,254 బస్తాల రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు 92,254 మిర్చి బస్తాలు వచ్చాయి. గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 89,659 బస్తాలు కొనుగోళ్లు జరిగింది. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 82,011 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

వైద్యసిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి



నరసరావుపేట: ప్రతి ఒక్కరూ రీ–ఓరియంటేషన్‌ను వినియోగించుకొని లక్ష్యాలను వంద శాతం సాధించి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి జి.శోభారాణి సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం తన కార్యాలయంలో జిల్లా గణాంక విభాగం ద్వారా జిల్లాలోని అన్నీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లోని ఏఎన్‌ఎంలకు చేపట్టిన పదిరోజుల శిక్షణను ప్రారంభించారు. మొదటిరోజు నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల ఏఎన్‌ఎంలకు ఆర్‌సీహెచ్, ఏఎన్ఎంఓఎల్ ప్రోగ్రాము, సీఎస్ఎస్ఎస్, హెచ్ఎంఐఎస్ రిపోర్టింగ్ ఫార్మెట్స్, యాప్‌లపైన శిక్షణతో పాటు ఆన్‌లైన్ సర్వీసులను పూర్తిగా వందశాతం వినియోగించుకొని ఫలితాలు సాధించే విధంగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్ఓ జి.చంద్రశేఖర్, డాక్టర్ హనుమకుమార్ పాల్గొన్నారు.

ఐదుగురిపై మాల్ ప్రాక్టీస్ కేసులు

గుంటూరు ఎడ్యుకేషన్: సీనియర్ ఇంటర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్–2 పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాల పరిధిలో కేటాయించిన 43,613 మంది విద్యార్థుల్లో 42,468 మంది విద్యార్థులు సోమవారం పరీక్షకు హాజరయ్యారు. పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై అధికారులు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేశారు. మాచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, చిలకలూరిపేటలోని సీఆర్ జూనియర్ కళాశాలలో ఇద్దరు చొప్పున, ఏఎంజీ జూనియర్ కళాశాలలో ఒకరు పట్టుబడ్డారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్

- ఇళ్ల వద్దకే వైద్యం
- గ్రామాల్లోనే ఉచిత వైద్య సేవలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 104 వాహనాల ప్రారంభం

చిలకలూరిపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం దేశ చరిత్రలోనే మైలురాయిగా నిలిచిపోతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని అధికారికంగా ప్రారంభించబోతున్న నేపథ్యంలో పల్నాడు జిల్లాకు సంబంధించిన నూతన 104 మొబైల్ మెడికల్ వాహనాలను స్థానిక ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వచ్చే నెల మొదటి వారంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారికంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అందు కోసం ఇప్పటికే నూతన 104 వాహనాలను సమకూర్చుకున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 260 వాహనాలను అన్ని జిల్లాలకు కేటాయించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 104 వాహనాలు 676 ఉన్నాయని, ఇప్పుడు వీటికి అదనంగా మరో 260 వాహనాలు వచ్చి చేరాయని చెప్పారు.



104 వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని, కలెక్టర్ శివశంకర్



సిద్ధంగా ఉన్న 104 వాహనాలు

విజయవంతంగా ట్రయల్ రన్...

ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి రజిని చెప్పారు. దేశ చరిత్రలోనే ఇది ఒక గొప్ప కార్యక్రమంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రతి గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను జగనన్న అందుబాటులోకి తీసుకొచ్చారని వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానంలో ఈ విలేజ్ క్లినిక్‌లు కీలకంగా మారనున్నాయని చెప్పారు. ప్రతి వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉండేలా నియామకాలు పూర్తి చేశామని, వీరిలో డాక్టర్ కచ్చితంగా మొబైల్ వాహనం ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు అందజేస్తారన్నారు. ముందే నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో 104 వాహనం ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ప్రతి గ్రామానికి నెలలో రెండు సార్లు వచ్చేలా కార్యక్రమం రూపొందించినట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించటం ఉచితంగా చికిత్స అందించటం వైద్యుల విధి అని పేర్కొన్నారు. ఏకంగా 14రకాల పరీక్షలను ఉచితంగా చేస్తారని చెప్పారు. ప్రస్తుతానికి 67 రకాల మందులు కూడా ఉచితంగానే అందజేస్తారని చెప్పారు. త్వరలో మందుల సంఖ్య 105కు పెంచనున్నమన్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువులకు కూడా ప్రత్యేక వైద్య సేవలు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో లభిస్తాయని చెప్పారు. డాక్టర్లు వారి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వచ్చి వైద్య సేవలు అందిస్తారన్నారు. కదలలేని పరిస్థితుల్లో మంచంలో ఉన్న రోగుల ఇళ్లకు వైద్యులు వచ్చి చికిత్స అందిస్తారని తెలిపారు. దీంతో పాటు ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు వ్యవస్థ ద్వారా ఆరోగ్య వివరాలన్నింటిని పదిల పరుస్తారని వివరించారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి నిలిపిందని చెప్పారు. మంత్రి రజిని స్వయంగా 104 వాహనం నడిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ జి.శోభారాణి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



104 వాహనాన్ని నడుపుతున్న మంత్రి రజిని

చంద్రబాబుకు ఓటు అడిగే హక్కులేదు

మంత్రి అంబటి రాంబాబు



రాజుపాలెం: చంద్రబాబుకు ఓటు అడిగే హక్కు లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మహిళల పొదుపు బకాయిలు కట్టవద్దు, నేను తీరుస్తానని మాట ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు అన్యాయం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన పాదయాత్రలో మహిళల వినతి మేరకు ఆయన స్పందించి మా ప్రభుత్వం వచ్చిన వెంటనే మహిళల రుణమాఫీ బకాయిలను విడతల వారీగా చెల్లిస్తానని ఇచ్చిన మాట మేరకు మాట తప్పకుండా, మడమ తిప్పకుండా చెల్లిస్తున్నారని పేర్కొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. మీరు పొదుపు చేసుకుంటున్న శ్రీనిధి, ఉన్నత పథకాలలో ప్రభుత్వం ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు స్వయం సంవృద్ధి సాధించేందుకే సీఎం జగన్ ప్రత్యేక పథకాలను మహిళల కోసమే ప్రవేశ పెట్టారని అన్నారు. సమావేశానికి మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ సభ్యులు దొంతిరెడ్డి సునీతాశ్రీనివాసరెడ్డి, డాక్టర్ గీతాహాసంతి, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, సర్పంచి పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, మార్కెట్ యార్డు చైర్మన్ కొండ్రెడ్డి పరమేష్, ఎస్‌కే సిలారీ పాల్గొన్నారు.

పుష్పార్చన.. పులకింత

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వసంత నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో ఆరో రోజైన సోమవారం కాగడా మల్లెలు, జాజులు, మరువంతో అర్చన నిర్వహించారు. విశేష పుష్పార్చన నిమిత్తం తీసుకువచ్చిన పుష్పాలతో ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబలు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పుష్పార్చన వేదిక వద్దకు చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి నిర్వహించిన విశేష పుష్పార్చనలో ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. పూజ అనంతరం అమ్మవారికి పంచహారతులు, నివేదన సమర్పించారు. పుష్పార్చన అనంతరం పుష్పాలను అమ్మవారి ప్రసాదంగా పంపిణీ చేశారు.

నేడు దేవదాయ శాఖ మంత్రి రాక..

ఉత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారికి ఎర్ర తామరలు, ఎర్ర గన్నేరు పూలు, సన్న జాజులతో అర్చన జరుగుతుంది. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబ సమేతంగా పాల్గొంటారని అర్చకులు పేర్కొన్నారు.



పది పరీక్షలకు సర్వం సిద్ధం

- ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం
- పగడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- నో సెల్ ఫోన్ జోన్ గా పరీక్షలు కేంద్రాలు
- తొలిసారి ప్రశ్నపత్రాలకు సీరియల్ నంబర్లు కేటాయింపు
- జిల్లాలో 127 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 24,354 మంది విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: పరీక్షా కాలం. ఇప్పటికే డిగ్రీ, ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. విద్యార్థులు ఈ పరీక్షలను తొలిమెట్టుగా భావిస్తుంటారు. అందుకు అనుగుణంగానే విద్యార్థులను తీర్చిదిద్దుతారు. తొలిసారే పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యేందుకు విద్యార్థులకు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. పరీక్షల నిర్వహణ క్లిష్టతరంగా ఉంటుంది. అందుకే అధికారులు పగడ్బందీ ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానుండటంతో అధికారులు పరీక్షల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాల గుర్తింపు, విద్యార్థుల కేటాయింపు, సీఎస్, డీఓ, ఇతర అధికారుల నియామకం పూర్తిచేయటంతో పాటు వారికి శిక్షణ తరగతులు నిర్వహించి సన్నద్ధం చేశారు. ఈ ఏడాది పరీక్షలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కీలక మార్పులు చేపట్టారు.

గతంలో ఏడు, ప్రస్తుతం ఆరు పరీక్షలే...

గత ఏడాది పదో తరగతి పరీక్షలలో ఏడు పేపర్లు ఉండగా, ఈ ఏడాది ఆరు పేపర్లకు కుదించారు. సైన్స్ పేపరును గతంలో జీవశాస్త్రం, భౌతికశాస్త్రం విడివిడిగా నిర్వహించగా, ఈ ఏడాది ఒకే ప్రశ్నపత్రంలో రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నారు. జీవశాస్త్రానికి, భౌతికశాస్త్రానికి విడివిడిగా 12 పేజీలతో కూడిన రెండు జవాబు పత్రాలను ఇవ్వనున్నారు. విద్యార్థులు తమకు అనుకూలమైన రీతిలో నిర్ణయించిన 3.15గంటల సమయంలో పరీక్ష పూర్తి చేయాల్సి ఉంది. అలాగే కాంపోజిట్ విద్యార్థులకు సంస్కృతం (04ఎస్) 30 మార్కులు, కాంపోజిట్ తెలుగు (03టి) 70 మార్కులకు నిర్వహిస్తున్నారు. ఓఎంఆర్ షీట్‌తో కూడిన 24పేజీల జవాబు పత్రంలోనే విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది. ఓఎంఆర్ షీట్‌లోని బార్‌కోడింగ్ పాడయినా, పేజీలు తక్కువగా ఉన్నా బ్లాంక్ ఆన్సర్‌బుక్ ఇస్తారు.



నరసరావుపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల

వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు....

పరీక్షల హాల్ టికెట్లను పాఠశాల విద్యాశాఖ, వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. హాల్ టికెట్లపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ధ్రువీకరణ, పాఠశాల ముద్ర ఉంటేనే పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు.

పగడ్బందీ ఏర్పాట్లు



పరీక్షల నిర్వహణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు దాదాపుగా పూర్తి అయ్యాయి. జిల్లాకు పశ్నపత్రాలు చేరుకున్నాయి. వాటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచాం. జిల్లాలో పరీక్ష రాయనున్న విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకుని ధైర్యంగా పరీక్షలు పూర్తి చేయాలి. కష్టపడిన వారికి ఫలితం దక్కుతుంది.

– శివశంకర్ లోతేటి, కలెక్టర్, పల్నాడు జిల్లా

ప్రశ్నపత్రాలపై సీరియల్ నంబరు....

ప్రశ్నపత్రాల లీకేజీ అరికట్టే దానిలో భాగంగా ఏడాది ప్రతి ప్రశ్నపత్రంపై సీరియల్ నంబర్ కేటాయిస్తున్నారు. సీరియల్ నంబర్ ఆధారంగా పరీక్ష కేంద్రాన్ని గుర్తించే వీలుంటుంది. అలాగే విద్యార్థులకు ప్రశ్నపత్రాలను సీరియల్ నంబర్ ప్రకారమే కేటాయిస్తారు. ఒకవేళ విద్యార్థి పరీక్షకు గైర్హాజరైతే సదరు సీరియల్ నంబర్ ప్రశ్నపత్రాన్ని అధికారులు భద్రపరిచి విద్యాశాఖకు అప్పగిస్తారు.

127 పరీక్ష కేంద్రాలు...

పల్నాడు జిల్లా పరిధిలో 433 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో 127 పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. వీటికి 127మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 127మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించారు. జిల్లాను 16 రూట్లుగా విభజించి 16మందిని రూట్ ఆఫీసర్లను, ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలను ఏర్పాటు చేశారు. కాగా, జిల్లా పరిధిలో 24,354 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1,946మంది సప్లిమెంటరీ విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ప్రశ్నపత్రాలను భద్రపరిచేందుకు 30 కస్టోడియన్(పోలీస్‌స్టేషన్) కేంద్రాలను గుర్తించారు. పరీక్ష సమయంలో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు.

పోలీస్‌స్టేషన్‌లకు చేరిన ప్రశ్నపత్రాలు...

పదో తరగతి ప్రశ్నపత్రాలను ఇప్పటికే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు చేర్చారు. పరీక్ష జరిగే రోజున 30 నిమిషాల ముందుగా ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు తమ కేంద్రాలకు తీసుకెళ్లనున్నారు.

ప్రజలను పదేపదే తిప్పకోవద్దు

- సమస్యలను సత్వరం పరిష్కరించాలి
- జవాబుదారీతనంగా అవసరం
- స్పందనలో జిల్లా కలెక్టర్ శివశంకర్
- 50 అర్జీల స్వీకరణ

నరసరావుపేట: ప్రజా సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలను పదే పదే తిప్పుకోవద్దని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాల్‌లో సోమవారం స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామోదయం ద్వారా వస్తున్న సమస్యలతో పాటు స్పందన అర్జీల స్వీకరణ సమయంలో జవాబు దారితనంగా ఉండాలని చెప్పారు. స్పందనకు 50 అర్జీలు వచ్చాయి. ప్రజల అందించిన ఫిర్యాదుల్లో భూ సమస్యలు, పెన్షన్లు, ఇంటి నివేశన స్థలాలు, ఉద్యోగ, ఉపాధి, రుణాలు, మౌలిక వసతులు కల్పించాలని పలువురు అర్జీలు అందించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వసంతబాబు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి..

వేసవి కాలంలో తరచుగా వచ్చే విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. సమస్యలను విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్, విద్యుత్ శాఖ ఈఈలకు ఫోన్: 94408 12261కు, టోల్ ఫ్రీ నంబరు 1912కి ఫోన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. వాటిని సంబంధిత శాఖ అధికారులు వెంటనే పరిష్కరిస్తారని పేర్కొన్నారు. స్పందన కార్యక్రమానికి తరలివచ్చిన ప్రజలకు పల్నాడు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరపున భోజనం ఏర్పాటు చేసిన దాత కూరపాటి పూర్ణచంద్రరావు, అత్తులూరి అయ్యప్పలను అభినందించారు.




స్పందనలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు

పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన దాసరి అచ్చయ్యకు ప్రభుత్వం ఐదెకరాల భూమిని ఇచ్చింది. దానిని అదే గ్రామానికి చెందిన ఐదుగురు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. భూమిలోకి వస్తే చంపుతామని బెదిరిస్తున్నారు. ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి వారిపై చర్యలు తీసుకోవాలి.

–జి.రామకృష్ణ, అచ్చయ్య కుటుంబ సభ్యుడు

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 531.40 అడుగుల వద్ద ఉంది. ఇది 170.8928 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 6,465, ఎడమకాలువకు 8,718, ఎస్ఎల్‌బీసీకి 2,000, వరదకాలువకి 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 17,503 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 17,503 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.30 అడుగుల వద్ద ఉంది. ఇది 33.9092 టీఎంసీలకు సమానం.

విద్యార్థుల సృజనాత్మకతకు పట్టం

- కొండవీడు యూపీ స్కూల్‌కు వండర్ బుక్ ఆఫ్ రికార్డు
- కాలీగ్రఫీ హ్యాండ్ రైటింగ్, డబల్‌పెన్సిల్, డిజైన్ ఇన్ కలర్స్ విభాగాల్లో ప్రదర్శన
- ప్రదర్శనకు హాజరైన వండర్‌బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు
- సర్టిఫికెట్లతో పాటు మెడల్స్, పుస్తకాలు అందజేత

యడ్లపాడు: సృజనాత్మకతకు పట్టం కట్టారు. కాలీగ్రఫీ రైటింగ్‌తో పాటు అందులో విభిన్న డిజైనింగ్ విభాగంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డు సాధించారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడులోని యూపీ పాఠశాలలో హెచ్ఎం జి.శ్రీనివాసరావు, కాలీగ్రఫీ శిక్షకులు షేక్ జున్ను సాహెబ్, విద్యా వలంటీర్ షేక్ చాందినీ ఆధ్వర్యంలో కాలీగ్రఫీ రైటింగ్‌తో పాటు అందులో విభిన్న డిజైనింగ్ విభాగంపై నెలరోజులు శిక్షణ ఇచ్చారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు బాలబాలికలందరూ పాల్గొని నేర్చుకున్నారు. సోమవారం వండర్ బుక్ ఆఫ్ రికార్డు భారత ప్రతినిధి వంగ నరేంద్రగౌడ్, న్యాయనిర్ణేతగా అదే సంస్థ ప్రతినిధి గంగాధర్, నరసరావుపేట లిమ్రా కోచింగ్ సెంటర్ చైర్మన్ షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో విద్యార్థులు నైపుణ్యాలను ప్రదర్శించారు. విద్యార్థులందరికీ వైట్ చార్టులు పంపిణీ చేసి రెండు గంటల్లో కాలీగ్రఫీలో తాము నేర్చుకున్న విభిన్నతను రాసి చూపించాలని లక్ష్యం ఇచ్చారు. కేవలం గంటా 26 నిమిషాల్లోనే ఎవరికీ వారు సొంతంగా సృజనాత్మకంగా పేర్లు, డిజైన్లు వేసి అందులో రకరకాల రంగుల్లో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు..

కాలీగ్రఫీ రైటింగ్, డిజైన్, కలరింగ్‌లో చూపిన ప్రతిభకు వండర్‌బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించినట్లు ప్రతినిధులు తెలిపారు. వెంటనే పాఠశాల హెచ్ఎం జి.శ్రీనివాసరావు, కాలీగ్రఫీ శిక్షకులు షేక్ జున్ను సాహెబ్, విద్యావలంటీర్ చాందినిలకు వండర్ బుక్ ఆఫ్ రికార్డు సంస్థ సర్టిఫికెట్‌తో పాటు మెడల్స్, 2022 ఘనతల పుస్తకాన్ని అందజేశారు.



వండర్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధుల నుంచి సర్టిఫికెట్లు, మెడల్స్, అందుకుంటున్న కొండవీడు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

భూ రీసర్వే వేగవంతం

జేసీ శ్యాంప్రసాద్


విలేకరులతో మాట్లాడుతున్న జేసీ శ్యాంప్రసాద్

ఈపూరు : పల్నాడు జిల్లాలో భూ రీసర్వే పనులు వేగంగా జరుగుతున్నాయని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ చెప్పారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జేసీ విలేకరులతో మాట్లాడుతూ తొలిదశలో 70 గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తయ్యాయని, వాటిలో 58 గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ చేశామని, 12 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించామని పేర్కొన్నారు. 46 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరలో ప్రారంభమవుతుందని, రిజిస్ట్రేషన్లను సచివాలయాల్లో కానీ, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కానీ చేయించుకోవచ్చని వివరించారు. జిల్లాలో మొత్తం 3.70 లక్షల ఎకరాలకు గ్రౌండ్ ట్రూత్ పూర్తయిందన్నారు. అకాల వర్షాలకు మొక్కజొన్న, శనగ పంటలు దెబ్బతిని ఉంటే అధికారులు పరిశీలించిన అనంతరం నష్టపరిహారం అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, సర్వేయర్ చండీరాణి పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం

- పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- స్పందన కార్యక్రమానికి 35 అర్జీలు
- పరిష్కారానికి అభయమిచ్చిన పోలీస్ బాస్


స్పందనలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, అదనపు ఎస్పీ బిందుమాధవ్

నరసరావుపేట: స్పందన అర్జీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి బాధితుల పక్షాన నిలబడతామని, వారికి న్యాయం చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని ఎస్పీ రవిశంకర్‌రెడ్డి చెప్పారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి 35 అర్జీలు స్వీకరించారు. పరిష్కారానికి అభయమిచ్చారు. అర్జీలను పోలీసు సిబ్బందికి పంపి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే స్పందనకు వచ్చిన ప్రజలకు పోలీసులు సహాయ సహకారాలు అందించారు. కొందరికి ఫిర్యాదులు రాయడంలో సాయం చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) జి.బిందుమాధవ్, డీఎస్పీలు సి.విజయభాస్కర రావు, బి.ఆదినారాయణ, దిశ డీఎస్పీ యు.రవి చంద్ర, సీఐ సుభాషిణి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. పోలీసు స్పందనకు వచ్చిన ప్రధాన ఫిర్యాదుల్లో కొన్ని..

పెద్దకుమార్తె ఆరుసెంట్ల స్థలం రాయించుకుంది



నాకు ఆరుగురు కుమార్తెలు. నాకు తెలియకుండా నా పెద్దకుమార్తె ఇల్లుతో కూడిన ఆరుసెంట్ల స్థలం అక్రమంగా రాయించుకుంది. పోలీసుస్టేషన్‌లో తగిన పరిహారం ఇస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు ఇవ్వట్లేదు. నాకు జరుగుబాటు లేదు. నా స్థలం నాకు ఇప్పించి న్యాయం చేయండి.

– తన్నీరు నారాయణమ్మ, చిలకలూరిపేట

భర్త వదిలించుకోవాలని చూస్తున్నాడు

రెండేళ్ల క్రితం మాచర్లలోని పోలిపల్లి గ్రామానికి చెందిన ప్రైవేటు ఉద్యోగితో నాకు వివాహమైంది. అప్పట్లో రూ.3.5 లక్షల కట్నం ఇచ్చాం. గతేడాది గర్భం దాల్చిన మూడు నెలలకే ఫిట్స్ రావటం మొదలైంది. దీంతో నా భర్త నన్ను పుట్టింటికి పంపి పట్టించుకోవడం మానేశాడు. వదిలించుకోవాలని చూస్తున్నాడు. నాకు నెలలు నిండకుండానే మగబిడ్డ జన్మించాడు. నా తల్లిదండ్రులు నా ఆరోగ్యం, పుట్టిన బిడ్డ కోసం రూ.10 లక్షలు ఖర్చు చేశారు. ఇప్పుడు నన్ను, నా బిడ్డను భర్త తీసుకెళ్లట్లేదు. నాకు న్యాయం చేయండి.

– చల్లా లక్ష్మీపార్వతి, పాలపాడు గ్రామం, నరసరావుపేట మండలం

నా ఇంటిని జేసీబీతో కూలదోశారు



నేను ప్రభుత్వం ఇచ్చిన ఇంట్లో ఉంటున్నాను. తన స్థలానికి అడ్డం వస్తున్నాయనే కారణంతో ఓ వ్యక్తి నా ఇంటితోపాటు పలువురి ఇళ్లను పోలీసుల సహాయంతో జేసీబీతో కూలదోశారు. అతడిపై చర్యలు తీసుకోవాలి.

– పఠాన్ గస్‌సైదా, ముప్పాళ్ల, సత్తెనపల్లి నియోజకవర్గం

ఇనుము తెప్పిస్తానని రూ.2 లక్షలు కాజేశాడు

కూలీనాలీ చేసుకుని సంపాదించుకున్న డబ్బులతో ఇల్లు కట్టుకోవాలనుకున్నాం. ఇంటి నిర్మాణం నిమిత్తం ఇనుము తెప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి రూ.2 లక్షలు తీసుకున్నాడు. ఇనుము లేదు.. డబ్బులూ తిరిగి ఇవ్వలేదు. అడిగితే తాను మరో వ్యక్తికి ఇచ్చానని చెబుతున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఆధారాలు లేవు అంటున్నారు. నాకు అతడి వద్ద నుంచి డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి.

– డి.శ్రీనివాసరావు, కారంపూడి

మానవాళి ప్రగతికే సాంకేతికత

జేఎన్‌టీయూ–ఎన్‌లో సాంకేతిక సమ్మేళనం


సావనీర్‌ను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ చక్రవర్తి తదితరులు

నరసరావుపేట ఈస్ట్: శాస్త్ర సాంకేతికత మానవాళి ప్రగతికే ఉపయోగపడాలని జేఎన్‌టీయూకే విశ్వవిద్యాలయం డిజిటల్ మానిటరింగ్ సెల్ స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎ.ఎస్.ఎన్.చక్రవర్తి చెప్పారు. జేఎన్‌టీయూ–ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో డెవలప్ ట్రీస్ సంస్థ సౌజన్యంతో జాతీయస్థాయి సాంకేతిక సమ్మేళనం నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ చక్రవర్తి మాట్లాడుతూ సాంకేతిక ప్రపంచంలో చోటుచేసుకుంటున్న మార్పులను ఎప్పటికప్పుడు విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే జవాబుదారీతనం, సత్ప్రవర్తన అలవరుచుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. సమ్మేళనంలో భాగంగా గేమిఫికేషన్, 3డీ ప్రింటింగ్ టెక్నాలజీపై వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి దాదాపు 500 మంది విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొన్నారు. అనంతరం సావనీర్‌ను ప్రొఫెసర్ చక్రవర్తి విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు, డెవలప్ ట్రీస్ సంస్థ సీఈఓ డి.శ్రావణ్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంటల్లో గాయపడ్డ టీడీపీ కార్యకర్త మృతి

మంగళగిరి: ఆత్మకూరు టీడీపీ జాతీయ కార్యాలయం వద్ద ఈనెల 24న బాణసంచా కాలుస్తూ ప్రమాదవశాత్తూ తీవ్రంగా గాయపడిన టీడీపీ కార్యకర్త సోమవారం రాత్రి మృతి చెందాడు. బాణాసంచా ప్రమాదంలో నలుగురు గాయపడి ఎన్నారై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో నగరంలోని మార్కండేయ కాలనీకి చెందిన తాడిశెట్టి చెన్నయ్య (25) మృతి చెందాడు. దీంతో అతని కుటుంబం అనాథగా మారింది.

పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: పంట నష్టం నమోదులో నష్టపోయిన ప్రతి రైతుకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. అకాల వర్షాలతో పంట నష్ట అంచనాల నమోదుపై వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాల వలన మొక్కజొన్న, మిరప, అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రొంపిచర్ల, నరసరావుపేట మండలాల్లోని పలు గ్రామాల్లో మొక్కజొన్న పూర్తిగా నేలవాలినట్లు పేర్కొన్నారు. నిబంధనల పేరుతో రైతులకు అన్యాయం చేయవద్దని సూచించారు. నేలవాలిన ప్రతి ఎకరాన్ని నమోదు చేయాలని కోరారు. అలాగే కల్లాల్లో ఉన్న మిరప కూడా వర్షానికి తడిచిందని, దీనిని కూడా పంట నష్టంగా భావించి నమోదు చేయాలని చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి మాట్లాడుతూ పంట నష్టంపై ఎప్పటికప్పుడు సిబ్బంది నుంచి ప్రాథమిక సమాచారం అందుతుందని చెప్పారు. జిల్లాల్లో 2,172 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్టు అంచనా ఉందని వెల్లడించారు. ఈనెల 31వ తేదీలోగా పంట నష్టం నమోదును పూర్తిచేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని కోరారు. ఏప్రిల్ ఒకటి నుంచి 3వ తేదీ వరకు గ్రామ సచివాలయాలు, ఆర్బీకేల్లో జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తం అందుబాటులో ఉంచుతారని పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన అధికారి బెన్ని మాట్లాడుతూ పంట నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా సిబ్బంది పనిచేయాలని తెలిపారు. పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పి.చిట్టిబాబు, ఎంపీపీ ఎం.శ్రీనివాసరావు, రొంపిచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ పచ్చవ రవి, ఏటలు నరేంద్రబాబు, విజయ భాస్కర్ పాల్గొన్నారు.

మామ కాదు.. కామాంధుడు!

- మామ లైంగిక వేధింపులపై అంధురాలైన కోడలు ఫిర్యాదు
- ప్రాణ రక్షణ కల్పించాలంటూ ఎస్పీకి వేడుకోలు!

నగరంపాలెం: పెళ్లయిన దగ్గర్నుంచి మామ లైంగికంగా వేధిస్తున్నాడు. అతనికి ఇద్దరు అత్తలు సహకరిస్తున్నారు. దీనిపై అంధురాలైన ఓ కోడలు భర్తతో కలిసి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక– స్పందన (గ్రీవెన్స్)లో ఫిర్యాదు చేసింది. మామ చేస్తున్న వికృత చేష్టలను చెబుతూ విలపించింది. బాధితురాలి మాటల్లో.. 2013లో పెళ్లయింది. భర్త ప్రైవేటు విద్యుత్ పనులు చేస్తుంటాడు. ఒక బాబు సంతానం. మామకు ఇద్దరు భార్యలు. పెళ్లయిన దగ్గర నుంచి మామ నన్ను వేధించడం మొదలెట్టాడు. ఇద్దరత్తలతో సంసారం చేస్తూ, నన్నూ సంసారం చేయాలని ఒత్తిడి చేస్తున్నాడు. లైంగిక సుఖాన్ని ఇవ్వాలని, అదును చూసి బలాత్కారానికి ప్రయత్నిస్తున్నాడు. తన కోరిక తీర్చలేదని నాపై పగ పెంచుకున్నాడు. నాతోపాటు నా భర్తను హింసిస్తున్నాడు. కొడుకు కోసం పెళ్లి చేయలేదని, తన కోసమని వేధిస్తున్నాడు. ఈ క్రమంలో 2023 జనవరి 3న ఇద్దరి అత్తల సహాయంతో నాపై లైంగిక దాడికి యత్నించి, శరీరమంతా రక్కాడు. దీంతో మనస్థాపం చెంది పురుగుమందు తాగి ఆత్మ హత్యాయత్నానికి ప్రయత్నించా. గతంలోనూ నాపై వేరే వారితో దాడి చేయించాడు. ఇవన్నీ కూడా నన్ను లోబర్చుకునేందుకు చేసినవే. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అయినప్పటికీ మామ ప్రవర్తనలో మార్పులేదు. కామవాంఛతో నాపై, నా భర్తపై వేరే వ్యక్తులతో దాడి చేయించాడు. కేసుల్లో రాజీకి రాకపోతే అంతు చూస్తానని ఊళ్లో బహిరంగంగా చెబుతున్నాడు. పలుకుబడి ఉన్న మామ ఏదైనా చేసేందుకు సిద్ధహస్తుడు అని ఆమె వివరించింది. తమ బిడ్డ కోసం జీవిస్తున్నామని, లేనిచో ఈ లోకాన్ని విడిచి వెళ్తామని విలపించింది. ఇప్పటికైనా మామ, ఇద్దరి అత్తలపై బైండోవర్ కేసులు నమోదు చేసి, మామపై రౌడీషీట్ తెరిచి తమకు ప్రాణరక్షణ కల్పించాలని ఎస్పీని అభ్యర్థించింది.

ప్రజా చైతన్యంతోనే సామాజిక సమస్యల పరిష్కారం


శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

అమరావతి: వందల ఏళ్ల నుంచి వేళ్లూనుకున్న సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారం ప్రజాచైతన్యంతోనే సాధ్యమని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక ధ్యాన బుద్ధ విగ్రహం వద్ద హరిత అతిథి గృహంలో సోమవారం కేవీపీఎస్ రాష్ట్రస్థాయి మూడురోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డి.ఆనందబాబు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వెంకటేశ్వర్లు వర్తమాన రాజకీయ పరిస్థితులు అనే అంశంపై మాట్లాడారు. తొలుత కేవీపీఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మరో ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ఉపాధ్యక్షుడు చిరంజీవి, సహాయ కార్యదర్శి పి.వసంత్, రాష్ట్ర నాయకులు ఈశ్వర్, కుటుంబరావు, రామదాసు, విజయమ్మ, ఎస్.జి.కృష్ణ, సింహాచలం, విజయరాజు, అమరావతి మండల ప్రజాసంఘాల కన్వీనర్ బి.సూరిబాబుతోపాటుగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరైన రెండు వందల మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో సమాజానికి హానికరం


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి

కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబ పరంగా, సామాజిక పరంగా తీవ్ర నష్టం కలుగుతుందని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అధికారులకు ఒకరోజు మాదక ద్రవ్యాల వినియోగం, నష్టాలపై ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల్ని తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించాలన్నారు. మన పిల్లలు మంచివారైనా చెడు స్నేహాల కారణంగా తప్పుదోవ పట్టే అవకాశాలున్నాయని చెప్పారు. ఒక్కసారి వాటికి బానిసలైతే తేరుకోవడం చాలా కష్టమని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి అధికారులు జిల్లా స్థాయి వరకు వీటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. అవగాహన కమిటీలో వివిధ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

క్లీనర్ మృతి.. డ్రైవర్‌కు గాయాలు


లారీ మధ్యలో ఇరుక్కు పోయి మృతి చెందిన క్లీనర్ భిక్షం

పిడుగురాళ్లరూరల్: లారీ పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడిన ఘటనలో క్లీనర్ మృతి చెందాడు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ దుర్ఘటన మండలంలోని కామేపల్లి కాసు బ్రహ్మానందరెడ్డి హైవేపై సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెట్రో కోక్ బొగ్గును లోడు చేసుకుని నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్ బాలానగర్‌కు వెళ్తున్న లారీ కామేపల్లి గ్రామం వద్ద అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో క్లీనర్ భిక్షం(45) అక్కడికక్కడే మరణించాడు. డ్రైవర్ దస్తగిరికి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. క్లీనర్ భిక్షం పల్నాడు జిల్లా నాగార్జున సాగర్ రైట్ కెనాల్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విజ్ఞాన్ స్రవంతి పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ విడుదల చేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు రూరల్: విద్యార్థులకు విద్యతో పాటుగా క్రీడలు, ఇతర రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చి వారి విద్యాభివృద్ధికి, ఉజ్వల భవిష్యత్‌కు తమ కళాశాల కృషి చేస్తోందని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తెలిపారు. సోమవారం పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ పీజీ కళాశాలలో ఏప్రిల్ 14, 15 తేదీలలో నిర్వహించనున్న విజ్ఞాన్ స్రవంతి సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర కళాశాలల విద్యార్థులకు వివిధ రంగాల్లో లలితకళలు, చిత్రలేఖనం, క్రీడలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల పోటీలను నిర్వహిస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనూరాధ మాట్లాడుతూ రెండు రోజులపాటు నిర్వహించే ఈ పోటీల అనంతరం విద్యార్థులకు బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల వృషభాలకు చాంపియన్‌షిప్


ప్రథమ స్థానంలో నిలిచిన వృషభరాజాలు


ప్రథమబహుమతి అందుకుంటున్న వేణుగోపాలరావు

నాదెండ్ల: పల్నాడు జిల్లా నాదెండ్ల గ్రామానికి చెందిన నల్లమోతు వేణుగోపాలరావుకు చెందిన ఒంగోలు జాతి వృషభ రాజాలు మహారాష్ట్రలో జరిగిన మహాపశుధన్ ఎక్స్‌పో–2023లో చాంపియన్‌షిప్ సాధించాయి. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా షిర్డీలో ఈనెల 20 నుంచి వారం రోజుల పాటు జరిగిన ఎక్స్‌పో–2023లో దేశ నలుమూలల నుంచి పశువులను తరలించారు. ఆల్ బ్రీడ్ మేల్, ఫిమేల్ చాంపియన్, ఒంగోలు జాతి పశువుల అందాల పోటీల్లో ప్రథమ స్థానాన్ని నాదెండ్ల వృషభాలు కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా మహారాష్ట్ర పశు సంవర్ధక శాఖ ముఖ్య కమిషనర్ చేతుల మీదుగా వేణుగోపాలరావు అవార్డును అందుకున్నారు. గత నెలలో ప్రపంచ స్థాయిలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సు, వండర్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో వేణుగోపాలరావుకు చెందిన కోడెదూడ చోటు సంపాదించింది. ఇరవై ఐదు నెలల వయస్సు గల ఒంగోలు జాతి కోడెదూడ 65 అంగుళాల ఎత్తుతో రికార్డు నెలకొల్పింది.

తాబేళ్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

ఫారెస్టు రేంజర్ శ్రీదేవి

వేటపాలెం: జిల్లా తీరం వెంట సముద్ర తాబేళ్ల సంరక్షణపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఫారెస్టు రేంజర్ ఆర్.శ్రీదేవి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని అక్కాయిపాలెం పంచాయతీ లక్ష్మీపురంలోని ట్రీఫౌండేషన్‌లో తాబేళ్ల సంరక్షకులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ 2017 నుంచి జిల్లాలో ఆలీవ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను సంరక్షిస్తున్నామని తెలిపారు. సముద్ర జీవవైవిధ్యంలో భాగంగా ఆలీవ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ ప్రధానమన్నారు. తాబేళ్ల మనుగడకు ఎవరైనా భంగం కలిగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీటిని సంరక్షించుకోవడం కోసం తీర ప్రాంత గ్రామాల్లో సంరక్షకులను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి, సంరక్షకులు రత్నకుమారి పాల్గొన్నారు.